క్లుప్తంగా

అభివృద్ధిలో భాగస్వాములమవుతాం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆశిష్ సంగ్వాన్‌ను గురువారం టీఎన్జీవో సంఘం నాయకులు కలిసి పూలమొక్క, నోటు పుస్తకాలు అందజేసి శాలువతో సన్మానించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమంలో తాము భాగస్వామ్యంగా ఉంటామని జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బి.సాయిలు అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం కార్యదర్శి ఎం.నాగరాజు, ప్రతినిధులు చక్రధర్, రాజేశ్వర్, గణేష్, రాజ్యలక్ష్మి, సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

సర్వే వేగం పెంచాలి



బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని కొన్ని గ్రామాలల్లో మిషన్ భగీరథ నల్లాల సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఎంపీవో మహబూబ్ అన్నారు. గురువారం శాంతాపూర్‌లో జరిగే నల్లాల సర్వేను పరిశీలించారు. వేగం పెంచి త్వరలో పూర్తి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. మండలంలో హజ్గుల్, శాంతాపూర్, బిచ్కుంద, వాజిద్‌నగర్‌లో సర్వే వందశాతం పూర్తి కావడం లేదు సర్వే కోసం అదనంగా కార్యదర్శులకు బాధ్యతలు ఇచ్చామన్నారు. మండలంలో 65 శాతం సర్వే పూర్తయ్యిందన్నారు.

మెప్మా పట్టణ సమాఖ్యపై విచారణ చేయాలి

కామారెడ్డి అర్బన్: మెప్మా కామారెడ్డి పట్టణ సమాఖ్యలో చాలా అవకతవకలు జరిగినందున విచారణ జరిపి బాధ్యులపై అధికారులపై చర్యలు తీసుకోవాలని పట్టణ సమాఖ్య మాజీ అధ్యక్షురాలు నంగునూరి లత ఒక ప్రకటనలో ఆరోపించారు. కామారెడ్డి పట్టణం మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బ్యాంకు ఖాతా, వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపు, పదేళ్లుగా పాతుకుపోయిన సిబ్బందిపై విచారణ చేయాలని త్వరలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు పట్టణ సమాఖ్య మాజీ అధ్యక్షురాలు లత పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



బాన్సువాడ : ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. హెచ్ఎం కొంతం వెంకన్న, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్ కౌన్సిలర్ అమేర్ తదితరులు ఉన్నారు.

నీళ్ల ట్యాంకు శుభ్రం



సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రాతినిధ్యం వహిస్తున్న 14వ వార్డులో కాకతీయ నగర్ నీళ్ల ట్యాంకు పరిశుభ్రతపై ఈనెల 19న బుధవారం సాక్షిలో వచ్చిన 'బయట ఇలా.. ట్యాంకు లోపల ఎలా ఉందో..' వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. గురువారం ట్యాంకు వద్ద పారిశుధ్య సిబ్బంది పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను పూర్తిగా తొలిగించినట్లు కాలనీవాసులు తెలిపారు. ట్యాంకు వద్ద శాశ్వత పరిష్కారం కోసం కంచె వేసి సిమెంట్ కాంక్రీటు వేయించాలని కాలనీవాసులు కోరారు.

ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వైద్య శిబిరం

ఎల్లారెడ్డి రూరల్ : జిల్లా అంధత్వ నివారణ కమిటీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరంలో 91 మంది రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్ తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ కమిటీ కంటి వైద్యుడు హరికిషన్, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నిషాత్ తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న సాగు పనులు

- రోజూ కురుస్తున్న వానలతో ఆనందం
- పొలాల్లో రైతన్న బిజీబిజీ



మద్నూర్‌లో పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు



మద్నూర్‌లో ఎడ్లతో విత్తనాలు అలుకుతున్న రైతులు

మద్నూర్(జుక్కల్) : ఐదు రోజులుగా నిత్యం వర్షం కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వేకువజామున నుంచే రైతులు సద్ది కట్టుకుని చేన్లకు పరుగులు పెడుతున్నారు. ఎడ్లకు, అరకలకు, ట్రాక్టర్లను సిద్ధం చేసుకోని తీరిక లేకుండా రైతన్నలు విత్తనాలు వేసుకుంటు బిజీబిజీ మారారు. వర్షాలు కురిసి వాతావరణం చల్లబడడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రైతులు వర్షాధారంపైనే పంటలు పండిస్తారు. గడిచిన ఏడాది కంటే ఈ సారి పత్తి, సోయాబీన్ సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ అధికారులు అంచనాలు వేస్తున్నారు. మండలంలో 150 ఎకరాల మొక్కజొన్న, 3,540 ఎకరాల పత్తి, 3,456 ఎకరాల పెసర, 4,120 ఎకరాల మినుము, 27 వేల ఎకరాల సోయా, 5 వేల ఎకరాల కంది మిగిలినవి కూరగాయలు తదితర పంటలు పండిస్తారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎవుసం కలిసిరావాలి



ఈసారి ఖరీఫ్ సీజన్ కొంత ఆలస్యమైనా వర్షాలు కురియడంతో సోయాబీన్ పంట విత్తాను. భూతల్లిని నమ్ముకుని దేవుడికి పూజ చేసి విత్తనాలు విత్తుకోవడం ప్రారంభించాను. మూడు ఎకరాల్లో సోయాబీన్ పంట వేశాను. ఈసారి ఎవుసం కలిసిరావాలి.

– నారాయణ, రైతు, మద్నూర్

పత్తి పంట వేశాను



వర్షం పడడంతో నేను పత్తి విత్తనాలను నాటాను. మా ఇంట్లో అందరు కలిసి వ్యవసాయం చేస్తాం. ఈ సారి వ్యవసాయం కలిసి రావాలి. పంట దిగుబడులు పెరిగి సాగు ఖర్చులు తగ్గాలి.

– హన్మాండ్లు, రైతు, మద్నూర్

సలహాలు తీసుకోవాలి

రైతులు ఉత్తమమైన మేలు రకాల విత్తనాలను తీసుకోవాలి. ఇప్పటికే వర్షాలు కురవడంతో రైతులు విత్తుకోవడం మొదలుపెట్టారు. క్షేత్రస్థాయిలో ఉండే వ్యవసాయ అధికారులు, విస్తరణాధికారుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలి.

– రాజు, ఏవో, మద్నూర్

యోగాలో రాణిస్తున్న నివాస్

రామారెడ్డి : నేటి రోజుల్లో యోగా ప్రతిఒక్కరి నిత్య జీవితంలో భాగమైంది. మెదడు పనితీరు మెరుగుపర్చుకునేందుకు, ఒత్తిడిని తగ్గించేందుకు యోగా ఉపయెగపడుతుంది. ఒకవ్యక్తి శారీరకంగా మానసికంగా బలంగా ఉండాలంటే యోగానే మార్గమని యోగాచార్యులు చెబుతూ ఉంటారు. అయితే చదువుకుంటూ యోగాలో రాణిస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఉప్పలవాయి గ్రామానికి చెందిన నివాస్. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఆయనపై ప్రత్యేక కథనం.. ఉప్పలవాయి గ్రామంలో ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న నివాస్ ఇప్పటిదాకా అనేక రాష్ట్రస్థాయి యోగాపోటీల్లో రాణిస్తూ పతకాలు సాధించాడు. 8వ తరగతి నుంచి ఉదయం సాయంత్రం క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తూ ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న వయస్సులో పలువురు విద్యార్థులకు నిత్యం యోగా నేర్పిస్తున్నాడు. గత కలెక్టర్ సత్యనారాయణతో శభాష్ అనిపించుకున్నాడు. రామారెడ్డి మండలంలోని ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, తాడ్వాయిలోని ఆర్య సమాజ్, కస్తూర్బాగాంధీ విద్యార్థులకు యోగాలో శిక్షణనిస్తున్నాడు. అలాగే ఉప్పల్‌వాయిలోని గురుకుల పాఠశాలలో యోగాసనాలు నేర్పించాడు. ఈ సందర్భంగా నివాస్ మాట్లాడుతూ యోగానే నా భవిష్యత్తు అంటున్నారు. ఆసక్తి చూపిన వారందరికీ తప్పనిసరిగా యోగా నేర్పిస్తానని అంటున్నాడు నివాస్.



యోగా చేస్తున్న నివాస్

అడ్మిషన్ల కోసం స్పెషల్ డ్రైవ్



లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన అడ్మిషన్ల కోసం ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం మెంగారం గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ చేయాలని వెల్లడించారు. కార్యక్రమంలో సిబ్బంది శివకుమార్, దార్‌సింగ్, రజాక్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



కామారెడ్డి టౌన్ : అమెరికాలో జరిగిన నాసా అంతర్జాతీయ సదస్సులో ప్రతిభ చాటి ద్వితీయ స్థానం సాధించిన కమ్మరి శ్రీమాన్‌ను గురువారం ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా సన్మానించారు. ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్ రాజు కుమారుడు శ్రీమాన్ కావడంతో ఇద్దరిని అభినందిచారు.

మోటార్ల బిగింపు



బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని ఆయా వార్డుల్లో గురువారం సింగల్ ఫేస్ మోటార్లను పంచాయతీ సిబ్బంది బిగించారు. తాగునీటి సమస్య ఉంది సింగిల్ ఫేస్ మోటార్లు కాలిపోయాయి కొన్ని నడవడం లేదని ప్రజలు ప్రత్యేక అధికారి తహసీల్దార్ సురేశ్‌కు ఫిర్యాదు చేయడంలో ఆయన స్పందించి 14, 15వ వార్డులలో సింగిల్ ఫేస్ కొత్త మోటార్లు తెప్పించి బిగించారు. కొన్నిచోట్ల ట్యాంకులు పగిపోవడం, నల్లాలే లేక నీరు వృథాపోతుండడంతో వాటికి మర్మతులు చేయించి ప్రజలకు నీరు అందించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే కార్యదర్శి, తనదృష్టికి తీసుకురావాలని ప్రజలకు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి



భిక్కనూరు : రాష్ట్రంలో పదేళ్లలో విద్యారంగం పూర్తిగా దెబ్బతిందని, సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు ఎన్ఎస్‌యూఐ నేతలు, యువజన కాంగ్రెస్ నేతలు తీవ్రంగా కృషిచేయాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం భిక్కనూరు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు తుడుం జీవన్, యువజన కాంగ్రెస్ నేతలు బాబు, లోకేష్, మామిడి మధులు ఎమ్మెల్సీ వెంకట్‌ను కల్సి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ విద్యార్థులు రాజకీయాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో దోపిడీని అరికట్టాలి

కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బి.శివ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మాట్లాడారు. అధిక ఫీజులు వసూళ్లతో పాటు, పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా బుక్స్, యూనిఫామ్స్, టై, బెల్టులు విక్రయిస్తున్నారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రోహిత్, హస్టల్ కన్వీనర్ ఖలీల్, నాయకులు వరుణ్, రాజు, సంతోష్, రాజు, బలరాం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ : ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలైమందని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బాల్‌రాజ్ అన్నారు. ప్రైవేటు పాఠశాల్లో, కళాశాలల్లో తక్షణమే ప్రభుత్వం ఫీజులను నియంత్రించాలని, కామన్ ఫీజు విధానం తీసుకురావాలని సూచించారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని అన్నారు.

ఎల్లారెడ్డి రూరల్ : రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం ఖచ్చితంగా అమలు చేస్తూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎల్లారెడ్డి ఏబీవీపీ నాయకులు జాషువా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా రూ. లక్షల్లో ఫీజులను విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారని, నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ పాఠశాలల్లో యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. నాయకులు వంశీ,వెంకట్, రాజశేఖర్, జ్ఞానేశ్వర్,సాయి, శంకు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు భిక్కనూరులో యోగా శిబిరం

భిక్కనూరు : ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా భిక్కనూరు మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో యోగా శిబిరంను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు యోగా గురువు బల్యాల నర్సింలు తెలిపారు. ఆయన గురువారం భిక్కనూరులో విలేకరులతో మాట్లాడుతూ ఉదయం యోగా శిబిరానికి ఎక్కువసంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు నివేదికలతో సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

కామారెడ్డి అర్బన్ : ఎక్సైజ్ తనిఖీల్లో పట్టుబడిన హీరో హోండా స్పెండర్, ట్రాలీ ఆటోను ఈనెల 21న శుక్రవారం ఉదయం 11 గంటలకు కామారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్టు ఆసక్తి గల వారు పాల్గొన వచ్చని సీఐ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బైక్ కనీస ధర రూ.25వేలు, ట్రాలీ ఆటో రూ. లక్షా 25లు నిర్ణయించినట్టు, వేలం ధరపై అదనంగా 18శాతం జీఎస్టీ ఉంటుందన్నారు. రూ. 5వేలు డిపాజిట్ ఏసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం





పోసానిపేటలో నులి పురుగుల నివారణ మాత్ర వేస్తున్న ఎంపీపీ దశరథ్‌రెడ్డి, రాజంపేట కేజీబీవీలో..



మద్నూర్‌లో..



పిట్లంలో..

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా గురువారం ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశకార్యకర్తలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



లింగంపేటలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి



నాగిరెడ్డిపేట కస్తూర్బాలో..



భిక్కనూరులో..



నిజాంసాగర్‌లో..



దోమకొండలోని అంబారీపేటలో..



కొయ్యగుట్టలో..



నస్రుల్లాబాద్‌లో..

ప్రభుత్వ కళాశాలలో చేరండి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ కళాశాలలో చేరాలని, ప్రభుత్వ కళాశాలలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని అధ్యాపకులు అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు గురువారం మండలంలోని ఆయా గ్రామాలలో తిరుగుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరాలని కోరారు. ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరుతున్నామన్నారు.

ప్రహరీ నిర్మించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని హరిజన వాడలో గల ప్రాథమిక పాఠశాలలో ప్రహరి నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం 40శాతం మాత్రమే ప్రహరి ఉంది. మిగితా 60 శాతం లేకపోవడంతో పశువులు, కుక్కలు, విష జంతువులు వస్తున్నాయి. వంట గది లేక పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజనం వండుతున్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



రెండు నియోజకవర్గాలకు తాగు, సాగునీరు

దోమకొండ : ప్రాణహిత చెవెళ్లను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ప్రణాళికతో పనిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రాణహిత చేవెళ్ల 20వ ప్రాకేజీ పనులు పూర్తయినట్లు తెలిపారు. 21వ ప్యాకేజీ పనులు, 70శాతం పూర్తయినట్లు వివరించారు. రిజర్వాయర్ మాసానిట్యాంక్ నుంచి కొండముచెరువు వరకు పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. భూంపల్లి ట్యాంక్ నుంచి లిఫ్ట్ కోసం టన్నెల్ మరమ్మత్తు చేపట్టి కామారెడ్డి ఎల్లారెడ్డి రెండు నియెజకవర్గాలకు తాగునీరు, సాగునీరు అందించడానికి షబ్బీర్‌అలీ కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు రావులపల్లి నర్సారెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారం మధు తదితరులున్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



నిజాంసాగర్(జుక్కల్) : జహీరాబాద్ పార్ల మెంట్ సభ్యుడు సురేశ్‌షెట్కార్‌ను గురువారం మహమ్మద్ నగర్ మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులకు సహకరించాలని ఎంపీని కోరినట్లు ఎస్టీసెల్ ఉపాధ్యక్షులు లోక్యానాయక్ తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో సవాయిసింగ్, తాటిపల్లి. సరస్వతిగౌడ్, భూమాగౌడ్, హరిన్, రఫీ తదితరులున్నారు.

'ప్రతిఒక్కరూ యోగా చేయాలి'



కామారెడ్డి అర్బన్ : మనిషి ప్రతినిత్యం యోగా జీవితం గడపడానికి ప్రయత్నం చేయాలని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి జయదీదీ అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డి ఓంశాంతి సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో యోగా, ధ్యానం అనంతరం జయదీదీ మాట్లాడారు. బస్వాపూర్, రామయంపేట, కామారెడ్డి, అక్కన్నపేట సెంటర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పింఛన్‌లో ఇబ్బందులపై వివరాలివ్వాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : చేయూత పింఛన్ డబ్బులు పొందడంలో ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారుల వివరాలను ఆయా గ్రామాల జీపీ కార్యదర్శులు వెంటనే సంబంధిత ప్రొఫార్మాలో తమకు అందించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో పర్బన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఒక గ్రామంలో పింఛన్ మంజూరై మరో గ్రామంలో పింఛన్ డబ్బులు పొందే లబ్ధిదారుల వివరాలను సేకరించాలని ఆయన చెప్పారు.

మోడల్ ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భానుమతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీలో 15 సీట్లు, సీఈసీలో 12 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెడ్డిపేటలో పుస్తకాల పంపిణీ

రామారెడ్డి : మండలములోని రెడ్డి పేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలను ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గర్గుల రాజాగౌడ్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రానికి చెందిన ఐదుగురు పీఈటిలు పీడీగా పదోన్నతులు పొందగా ఒక ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు హెచ్ఎంగా ప్రమోషన్ పొందారు. మండలంలోని చిట్యాలలో ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న పుల్లూరి స్వామికి హెచ్ఎంగా ప్రమోషన్ వచ్చింది. అలాగే మండలంలోని బ్రాహ్మణపల్లి పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న బాలయ్యతో పాటు ఇతర మండలాలలో పీఈటీలుగా పనిచేస్తున్న నాగరాజు, నగేష్, వీరేషం, స్వామిగౌడ్‌లకు పీడీలుగా పదోన్నతులు పొందారు.

పిట్లం నుంచి..

పిట్లం(జుక్కల్): మండలంలోని మద్దెలచెరువు, హస్నాపూర్, నాగంపల్లి, కారెగాం తాండ, పిట్లం, బొల్లక్‌పల్లి, గౌరారం, రాంపూర్, కుర్తి, చిల్లర్గి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించిన 38 మంది ఉపాధ్యాయులు ప్రమోషన్ పొంది ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు.

ఆర్థికసాయం అందజేత

దోమకొండ : మండలంలోని సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన నీల నర్సింలు ఇటీవల ప్రమాదవశాత్తు ఇంట్లో జారిపడగా, కాలు విరిగింది. దీంతో సిద్దిపేట ఆస్పత్రిలో చికిత్స పొందారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు షబ్బీర్‌అలీ ఫౌండేషన్ ద్వారా బాధితుడికి గురువారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో పార్ట్ టైం అధ్యాపకుడిగా ఫిజిక్స్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీతో పాటు పీజీ(ఫిజిక్స్) పూర్తిచేసిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈనెల 24వరకు దరఖాస్తుతో తమ పాఠశాలలో సంప్రదించాలన్నారు.